సాక్షి
గుంటూరు
మంగళవారం । 20 । మే । 2025



కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం

దుగ్గిరాల: ఎసుపు యార్డు సమీపంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది.



మహాలక్ష్మికి లక్ష మల్లెల పూజ

తెనాలి: అంగలకురుదులో వేంచేసిఉన్న మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సోమవారం లక్ష మల్లెపూలతో, పలు ద్రవ్యాలతో విశేష పూజలు చేశారు.

16 రోజుల పండుగ వేడుకలు



గోలి(రెంటచింతల): గోలి గ్రామంలో అతిపురాతనమైన నాగేంద్రస్వామి వారి దేవస్థానంలోని నీలంపాటి అమ్మవారి ఆలయం 16 రోజుల పండుగ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

దుగ్గిరాల మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం



దుగ్గిరాల: స్థానిక మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక సోమవారం నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి డ్వామా పీడీ శంకర్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. టీడీపీ నుంచి ఎనిమిది మంది, జనసేన నుంచి ఒకరు హాజరయ్యారు. కోరం సరిపోవడంతో ప్రిసైడింగ్ అధికారి ఎన్నిక ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ సభ్యులంతా గైర్హాజర్ అయ్యారు. తుమ్మపూడి గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు వాసిరెడ్డి లక్ష్మీదేవి మంచికలపూడి ఎంపీటీసీ సభ్యుడు మరీదు రాము పేరును ప్రతిపాదించారు. ఈమని-1 ఎంపీటీసీ సభ్యురాలు పసుపులేటి సాయి చైతన్య బలపరిచారు. దీంతో మరీదు రాము ఎన్నిక ఏకగ్రీవమైంది. ప్రిసైడింగ్ అధికారి ఆయనకు ధ్రువీకరణ పత్రం అందించి ప్రమాణం చేయించారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు.

ఆర్టీసీ స్థలాల లీజుపై 22న సమావేశం

పట్నంబజారు: గుంటూరు జిల్లా పరిధిలోని పెదకాకాని, తెనాలి, పెదనందిపాడు బస్సు స్టేషన్ల పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు ఈనెల 22న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. ఆసక్తి గల వారు ఆ రోజు సమావేశానికి హాజరుకావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీ.ఏపీ.జీవోవి.ఇన్‌లో లేదా 9959225412 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గరుడ వాహనంపై గ్రామోత్సవం



తెనాలి టౌన్: వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం ఉదయం 7.30 గంటలకు నిత్య హోమం, బలిహరణ, ఉదయం 8గంటలకు గరుడ వాహనంపై పురవీధుల్లో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దివ్య రథోత్సవం, ప్రత్యేక పుష్పాలంకరణ, మేళతాళాలు, విద్యుత్ దీప కాంతుల నడుమ స్వామి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణ ప్రజలంతా తిలకించి తరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ పర్యవేక్షించారు.

ఈఏపీ సెట్ ప్రారంభం

- సజావుగా అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 3,347 మంది విద్యార్థులు హాజరు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఏపీ ఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టులు (సీబీటీ) సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగిన అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 3,347 మంది విద్యార్థులు హాజరయ్యారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 22 కేంద్రాల పరిధిలో సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో జరిగిన ఆన్‌లైన్ పరీక్షలకు దరఖాస్తు చేసిన 3,588 మంది విద్యార్థుల్లో 3,347 మంది హాజరయ్యారు. మంగళవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగనుండగా, ఈనెల 21 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఆయా కేంద్రాల పరిధిలో ఆన్‌లైన్ సీబీటీ పరీక్షలు సజావుగా జరిగాయి.

ఏదీ.. ఆ నీటి వైభవం!

- పలుచోట్ల ఆక్రమణల చెరలో కాలువ భూములు
- అభివృద్ధి చేస్తే తక్కువ వ్యయంలో జల రవాణా మార్గం
- ప్రతిపాదనలను పక్కన పెట్టిన కేంద్రం

పూడికతీతకు నోచుకోని బకింగ్ హామ్ కెనాల్


తాడేపల్లి రూరల్: రెండు రాష్ట్రాల మధ్య ప్రముఖ జల రవాణా మార్గమైన బకింగ్ హామ్ కెనాల్ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కునారిల్లుతోంది. వేల ఎకరాల కాలువ భూములు ఆక్రమణల చెరలో ఉండటంతో రూపురేఖలను కోల్పోయింది. కెనాల్ మొత్తం పొడవు 427 కిలోమీటర్లు. కృష్ణా, గోదావరి డెల్టాలను కలుపుతూ ప్రవహిస్తుంది. కొన్నిచోట్ల సముద్రానికి మూడు మైళ్లు, ఎక్కువ భాగం అర కిలోమీటరు దూరంలోనూ ఉండడం విశేషం. కొంత భాగం పులికాట్ సరస్సు పరిధిలో ఉంది.

ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కాలువ

బకింగ్ హామ్ కెనాల్ ప్రకృతి సిద్ధంగా ఏర్పడింది. 1806లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నుంచి కో క్రైన్స్ అనే వ్యక్తి లీజుకు తీసుకున్నాడు. దీంతో కొంత కాలం ఆయన పేరు మీదే కో క్రైన్స్ కెనాల్ అని పిలిచేవారు. లీజుకు తీసుకున్న ఆయన ఓడల వద్ద డబ్బులు వసూలు చేసేవాడు. 1837లో బ్రిటిష్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అప్పటి గవర్నర్ డ్యూక్ బకింగ్‌హామ్ పర్యవేక్షణలో కాలువ పనులు జరగడంతో ఆ పేరు వచ్చింది. బంగాళాఖాతం తీరానికి కిలోమీటరు దూరంలో, ఆంధ్రాలోని కాకినాడ నుంచి, చెన్నైలోని విల్లుపురం వరకు కాలువ నిర్మాణం జరిగింది. ఈ కాలువ ఆంధ్రప్రదేశ్‌లో 262 కి.మీ., తమిళనాడులో 165 కి.మీ. పొడవు ఉంది.

ప్రధాన జల రవాణా మార్గం

బకింగ్ హామ్ కాలువ బ్రిటిష్ వారి హయాంలో ఒక వెలుగు వెలిగింది. ఈ మార్గంలో రైల్వేలైన్ ఏర్పాటు చేయక ముందు ఇదే ప్రధాన జల రవాణాగా ఉంది. కాకినాడ నుంచి చెన్నై వరకు ఉన్న కాలువల్లో ఇది ఒకటి. గోదావరి జిల్లాలో కాకినాడ కాలువ, కృష్ణా జిల్లాలో ఏలూరు కాలువ, గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల నుంచి బాపట్ల జిల్లా పెదగంజాం వరకు కొమ్మమూరు కాలువగా దీన్ని పిలుస్తారు. పెదగంజాం నుంచి ఒంగోలు, కొత్తపట్నం మీదుగా చెన్నై



బకింగ్ హామ్ కెనాల్


వరకు బకింగ్‌హామ్ కెనాల్‌గా పిలుస్తారు.

దుగ్గిరాల లాకుల వద్ద చీలిక

1855లో కృష్ణా బ్యారేజ్‌ని నిర్మించిన తరువాత ఈ కాలువ నిర్మాణం పూర్తయింది. విజయవాడ వద్ద కృష్ణా బ్యారేజ్ వద్ద నుంచి కుడి ప్రధాన కాలువ దుగ్గిరాల లాకుల వద్ద రెండుగా చీలుతుంది. వాటిలో ఒక కొమ్మమూరు కాలువ కాగా, రెండవది నిజాంపట్నం కాలువ. దుగ్గిరాల లాకుల వద్ద మొదలైన కొమ్మమూరు కాలువ సంగం జాగర్లమూడి, చేబ్రోలు, కొల్లిమర్ల, నర్సాయపాలెం, కారంచేడు, సంతరావూరుల మీదుగా పెదగంజాంవద్ద వరకు ఉంది. పెదగంజాం వద్ద ఇది బకింగ్‌హామ్ కాలువతో కలుస్తుంది. కొమ్మమూరు కాలువ మంచినీటితో కూడిన పంట కాలువ కాగా, బకింగ్ హామ్ కాలువ ఉప్పునీటి కాలువ. అప్పట్లో కాలువపై రవాణాకు అనుగుణంగా కాకినాడ నుంచి చెన్నై వరకు పలు చోట్ల లాకులను నిర్మించారు. వీటిని 150 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు గల చాంబర్లతో ఏర్పాటు చేశారు.

జాతీయ జలమార్గం-4గా కేంద్రం ప్రతిపాదన

జల రవాణా మార్గాల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని వజీరాబాదు నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు ఉన్న కృష్ణానది, భద్రాచలం వద్ద నుంచి ధవళేశ్వరం వరకు ఉన్న గోదావరి, కాకినాడ కాలువ, ఏలూరు కాలువ, కృష్ణా కాలువ, కొమ్మమూరు కాలువ, బకింగ్‌హామ్ కాలువలన్నింటినీ కలిపి జాతీయ జలమార్గం-4గా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాలను కలిపే 1,095 కిలోమీటర్ల పొడవైన దీన్ని జాతీయ జలమార్గం-4గా ప్రకటించారు. జాతీయ జలమార్గాల బిల్లు ద్వారా 2008 నవంబర్‌లో దీన్ని జాతీయ జలమార్గంగా ప్రకటించారు. అప్పట్లో 2013 నాటికి పూర్తి చేయాలని తలపెట్టారు. కానీ నేటికీ జాతీయ జలమార్గం-4 ఊసే లేకపోయింది.



బకింగ్ హామ్ కెనాల్ మ్యాప్

పాలకుల నిర్లక్ష్యం



బ్రిటిష్ వారి హయాంలో బకింగ్‌హామ్ కెనాల్ ఒక వెలుగు వెలిగింది. ఇప్పటి పాలకుల నిర్లక్ష్యంతో ఉపయోగంలో లేకుండా పోయింది. దక్షిణ భారతావని 1876, 1878లో కరువు కోరల్లో చిక్కుకున్న సమయంలో ఆహార ధాన్యాల తరలింపులో కీలకపాత్ర పోషించింది. 1880 నుంచి 1940 వరకు అతి తక్కువ ఖర్చులో ప్రజల, సరుకుల రవాణా సౌకర్యానికి ఉపయోగపడింది. స్వాతంత్ర్యానంతరం 1947 నుంచి దీన్ని ఉపయోగించడం తగ్గింది. అప్పటికి రైల్వే లైన్ అందుబాటులోకి రావడంతో ఈ కాలువ ద్వారా రవాణా నిలిచిపోయింది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లా పరిధిలో ఉన్న కొమ్మమూరు కాలువ ద్వారా పడవల రవాణా నిలిచిపోయినప్పటికీ సాగు, తాగునీటి కాలువగా ఉంది. పెదగంజాం నుంచి పిలువబడే బకింగ్‌హామ్ కాలువ ఉప్పునీటితో ఉంటుంది. జల రవాణా నిలిచిపోవడంతో భారీగా ఆక్రమణలకు గురైంది. కొన్ని చోట్ల రూపురేఖలను కోల్పోయింది. వేల ఎకరాల కాలువ భూములు ఆక్రమణకు గురయ్యాయి. దీన్ని జల రవాణా మార్గంగా అభివృద్ధి చేస్తే తక్కువ వ్యయంలో సరుకులు రవాణా చెయ్యవచ్చు. పర్యాటకంగా కూడా కాలువ ఆకర్షణీయ మార్గంగా అభివృద్ధి చెందుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బకింగ్‌హామ్ కెనాల్‌ను జల రవాణా మార్గంగా అభివృద్ధి చేసే చర్యలు చేపట్టాల్సి ఉంది. కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన గేట్లు సైతం తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

పూజల్లో సామాన్య భక్తులకు అవకాశం



సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: గుంటూరు నగరంలోని నాజ్ సెంటర్‌లో గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఐదు రోజులపాటు జరిగే పూజల్లో సామాన్య భక్తులకు రిక్త హస్తం చూపుతున్నారని 'సాక్షి'లో సోమవారం 'పెద్దలకే పెద్దపీట' పేరుతో కథనం వెలువడింది. దీనిపై హనుమాన్ దీక్ష సమాజం సభ్యులు, ఆలయ అధికారులు స్పందించారు. ఐదు రోజులపాటు జరిగే సేవా కార్యక్రమాల్లో సామాన్య భక్తులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా సోమవారం జరిగిన లక్ష తులసి మొక్కల పూజల్లో మహిళలు, సామాన్య భక్తులు పాల్గొన్నారు. 'సాక్షి'లో వచ్చిన కథనంపై హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న రశీదుల పరంపర

గతంలోనే 'సాక్షి'లో నాజ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న పూజలకు రశీదు ఇవ్వడం లేదని కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన లక్ష తులసి దళం పూజకు హాజరైన దాతలు రూ. 5,116, ప్రత్యేక హోమానికి రూ. 5,116, క్షీరాభిషేకానికి రూ. 1,116లు రుసుం చెల్లించారు. 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమైన తరువాత అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర ఆలయాన్ని సందర్శించారు. రుసుం చెల్లించకుండా ఎట్టి పరిస్థితుల్లో పూజలు నిర్వహించేందుకు అనుమతులు లేవని తేల్చి చెప్పారు. దీంతో దీక్ష సమాజం సభ్యులు ప్రతి పూజకు రశీదులు అందిస్తున్నారు.

అర్జీదారులను పదే పదే తిప్పకోవద్దు

జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: అర్జీల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను అధికారులు పదే పదే తమ కార్యాలయాలకు తిప్పుకోవద్దని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కూడా రోజుల తరబడి వేచి చూస్తున్న సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలు వినాల్సిన బాధ్యత అధికారులకు ఉందని చెప్పారు. ప్రజలు కూడా అర్జీలను స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చని, దీంతో ప్రజల సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని



ప్రజల సమస్యలు వింటున్న జాయింట్ కలెక్టర్

పేర్కొన్నారు. ప్రజలు అందించే అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, సమస్యల పరిష్కారంలో నిర్లిప్తత ఉండకూడదని అధికారులకు తెలిపారు. అనంతరం వచ్చిన 190 అర్జీలను జేసీతో పాటు డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

వైద్యులు నా కుటుంబాన్ని నాశనం చేశారు



ఈ ఏడాది ఫిబ్రవరిలో నా భర్త సాయి బాబు బల్బు బిగిస్తూ కాలు జారి కింద పడ్డారు. దీంతో ఆయనకు చేయి మణికట్టు వద్ద విరిగింది. స్థానిక కొత్తపేటలోని హాస్పిటల్‌కు తీసుకెళితే సర్జరీ చేశారు. చేసిన మరుసటి రోజే ఆయనకు కుడివైపు పక్షవాతం వచ్చింది. కనీసం ఆసుపత్రి వైద్యులు చికిత్స చేయకపోగా హడావుడిగా మమ్మల్ని బయటకు పంపేశారు. నాకు ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబాన్ని నడిపించే నా భర్త అచేతనంగా పడి ఉండడానికి ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణం. మెడికల్ వెరిఫికేషన్ పెట్టించాలని మనవి.

–జిక్కంపూడి శ్రీవల్లి, గుంటూరు

మా ఉపాధిని ప్రశ్నిస్తున్నారు



స్థానిక బస్టాండ్ ప్రాంతంలో మేము 1976 నుంచి టాక్సీ స్టాండ్ నిర్వహించుకుంటున్నాం. ఇప్పుడు శ్రీను అనే వ్యక్తి వచ్చి మా టాక్సీలను తీసేయమని రౌడీయిజం చేస్తున్నాడు. మొత్తం 75 మంది దీనిపై జీవనం కొనసాగిస్తున్నారు. మాకు న్యాయం చేయండి.

–బస్టాండ్ టాక్సీ యజమానులు, డ్రైవర్లు

స్థలం ఆక్రమించేందుకు యత్నాలు

ఇంటి స్థలాన్ని ఆక్రమించేందుకు తెలిసిన వ్యక్తి ప్రయత్నిస్తున్నాడు. నంబూరు గ్రామం విజయ భాస్కర్‌నగర్‌లోని ఇంటి స్థలాన్ని ఆక్రమించేందుకు లక్ష రూపాయలకు సేల్ కమ్ జీపీఏ ఉందని, చట్ట ప్రకారం చెల్లని డాక్యుమెంట్ తీసుకొచ్చి బెదిరిస్తున్నారు. దౌర్జన్యంగా ప్రవేశించి అక్రమ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారు. సదరు వ్యక్తిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. అతని బంధువుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నా.

– మొండితోక మరియదాసు, విజయభాస్కర్‌నగర్, నంబూరు, పెదకాకాని.

పశ్చిమ డెల్టా మరమ్మతులకు రూ.25 కోట్లు మంజూరు

జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాలోని పంట, మురుగు కాల్వల మరమ్మతులను జూన్ పదో తేదీలోగా పూర్తి చేయాలని జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పులిపాటి వెంకటరత్నం సూచించారు. పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం స్థానిక జలవనరుల శాఖ డివిజన్ కార్యాలయం హాలులో నిర్వహించారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు అధ్యక్షత వహించారు. ఇంజినీర్ వెంకటరత్నం మాట్లాడుతూ ఖరీఫ్ సీజను ఆరంభానికి మరమ్మతుల పనులన్నీ పూర్తికావాలని ఆదేశించారు. నారుమడులకు సాగు నీటిని జూన్ పదో తేదీ నాటికి పంట కాల్వలకు విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆలోగా కాల్వలు, డ్రెయిన్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.25 కోట్లను మంజూరు చేసిందని వెల్లడించారు. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు మాట్లాడుతూ పశ్చిమ డెల్టాలో పంట, మురుగు కాల్వలకు మరమ్మతుల్లో మొత్తం 746 పనులను గుర్తించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్ఈ

అదే.. ఆ తల్లి ప్రత్యేకత

- మానసిక పరిణితి లేని ఆడపిల్ల నీహారిక
- కంటిపాపలా చూసుకున్న తల్లిదండ్రులు
- ఆనందాన్ని, అవసరాలను వదులుకున్నారు
- బిడ్డ కోసం టీచరుగా మారిందా తల్లి
- ఇష్టమైన సైక్లింగ్‌లోనూ శిక్షణనిచ్చింది
- స్పెషల్ ఒలింపిక్స్‌లో పతకాలు నెగ్గేలా చూశారు
- ఇప్పుడా బిడ్డలాంటి మరికొందరికోసం ఏకంగా అలాంటి పాఠశాలనే నడుపుతోందా తల్లి

ప్రత్యేక అవసరాలు గల బిడ్డలు ఎందరికో తల్లిగా మారింది

తెనాలి: ''అది 2019 సంవత్సరం మార్చి నెల. 14-21 తేదీల్లో దుబాయ్‌లో స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్. 25 గేమ్స్‌లో 170 పైగా దేశాలకు చెందిన ఏడు వేల క్రీడాకారులు పాల్గొన్నారు. మనదేశం నుంచి 280 మంది వివిధ పోటీల్లో తలపడ్డారు. ఇందులో సైక్లింగ్‌లో 16 మంది పాల్గొంటే, ఆంధ్రప్రదేశ్ నుంచి ఓ యువతి ఆ పోటీలో పాల్గొంది. ఆ పోటీల్లో యువతి 500 మీటర్లు, కిలోమీటరు పోటీలు రెండింటిలోనూ ద్వితీయ స్థానం సాధించి రజత పతకాలను కైవసం చేసుకుంది. రెండు కి.మీ పోటీల్లో ఆరోస్థానంలో నిలిచింది. ఆ యువతే 2018లో రాంచీలో నిర్వహించిన జాతీయ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో కిలోమీటరు సైక్లింగ్‌లో బంగారు పతకం, రెండు కి.మీ విభాగంలో రజత పతకం గెలిచి, స్పెషల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది.'' మానసిక పరిపక్వత లేదని సమాజం ఈసడించింది. తనపై డబ్బు ఖర్చుచేసినా, శ్రమ వెచ్చించినా ఎలాంటి ప్రయోజనం లేదు... తిండి, బట్ట ఇస్తే సరిపోతుందని తల్లిదండ్రులకు జాగ్రత్తలు చెప్పింది. అయితే సమాజం మాటవిని ఆ పాపను తల్లిదండ్రులు వదిలేయలేదు. తనకోసం తమ ఆనందాల్నీ, అవసరాలనూ వదులుకున్నారు. మానసిక వికలాంగురాలైన తమ కూతురు నీహారికను తన కాళ్లపై తాను నిలబడేలా చేయాలని కంకణం కట్టుకున్నారు. విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాలలో చదివిస్తూ తనకెంతో ఇష్టమైన సైక్లింగ్‌లో శిక్షణనిస్తూ వచ్చిందా తల్లి భార్గవి. తద్ఫలితమే.. నీహారిక సాధించిన విజయాలు.

భార్గవి సొంతూరు చినపరిమి

భార్గవి సొంతూరు తెనాలి సమీపంలోని చినపరిమి. భర్త ఆర్మీ ఉద్యోగి ముక్కామల శివరామకృష్ణ. 2001లో తొలి కాన్పులో లక్ష్మీదేవి పుట్టిందని సంబరపడ్డారు. ఏడాదిన్నర వచ్చినా నడక రాకపోవటంతో అనుమానం వేసింది. ఉద్యోగరీత్యా అప్పుడు జమ్మూ కశ్మీర్‌లో ఉన్నారు. 'ఒకసారి న్యూమోనియాకు ఇచ్చిన మందు ఓవర్‌డోస్ అయి, నాలుగురోజులు పాప కోమాలో ఉంది... తెలివొచ్చేసరికి మాటలు బాగా తగ్గిపోయాయి..చెప్పిందీ అర్థం చేసుకోవటం తగ్గింది. డ్రమ్స్ మోగినా, బాణసంచా పేలుళ్ల విన్నా, భయంతో వణికేది...పెరిగేకొద్దీ ఆ భయం ఎక్కువైంది' అని భార్గవి గుర్తుచేసుకున్నారు. అయిదో ఏడు వచ్చేసరికి ఆగ్రాకు వెళ్లారు. అక్కడి డాక్టర్లు 'ఇంటలెక్చువల్ డిసేబిలిటీ' అన్నారు. 'పిల్లలతో విపరీతంగా ప్రవర్తించేది అప్పుడే...డ్రమ్స్, బాణసంచా మోతకు భయపడిపోయేది. ఎవరినీ దగ్గరకు రానిచ్చేదికాదు...తనొక్కతే ఏదొక వస్తువుతో ఆడుకుంటూ ఉండేది...ఆ క్రమంలో సైకిల్ తనను బాగా ఆకర్షించింది...చిన్న సైకిల్ నడిపేది. పాడైపోతే కొత్తది కొనేదాకా ఊరుకునేది కాదు...ఆ ఆసక్తిని గమనించి ప్రోత్సహించాను' అన్నారు భార్గవి. అప్పటికి తనకు మరో బాబు కలిగాడు.



కుమార్తె నీహారికతో ముక్కామల భార్గవి

కుమార్తె కోసం త్యాగాలు..

పాప ఆరోగ్యం కారణంగా హైదరాబాద్‌కు బదిలీ చేయించుకున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాలలో చేర్పించారు. కొడుక్కి హోం వర్క్ చేయించేటపుడు, నీహారికను దగ్గరుంచారు. స్పీచ్ థెరపీనీ ఇప్పించారు. 2013లో విజయవాడకు వచ్చేశారు. 2013 నవంబరులో ఇలాంటి పిల్లల కోసం ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని తెలుసుకున్నారు. 2014లో పార్టిసిపేట్ చేసేలా చూశారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకు పాపను నిద్రలేపటం, హైవేపై 10 కి.మీ ప్రాక్టీస్ చేయించి, ఇంటికి తీసుకొచ్చేవారు. తర్వాత 'ఆటిజమ్ రీసెర్చ్ అండ్ మల్టీ డిసిప్లిన్ స్కూలు'కు తీసుకెళ్లారు. నీహారిక కోసం తనుకూడా అదే స్కూలులో ఉద్యోగం చేశారు భార్గవి. శివరామకృష్ణ కూడా వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు.

మరెన్నో విజయాలు..

2014లో భోపాల్‌లో జరిగిన ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లోనూ కి.మీ, 2 కి.మీ విభాగాల సైక్లింగ్‌లో బంగారుపతకం, రజత పతకాన్ని నీహారిక సాధించింది. ఈ విజయంతో 2015లో లాస్ఏంజెల్స్‌లో జరిగిన స్పెషల్ ఒలింపిక్స్‌కు ఎంపికైనా, అనివార్య కారణాలతో సైక్లింగ్‌లో పాల్గొనేందుకు వీల్లేకపోయింది. యూనిఫైడ్ వాలీబాల్ గేమ్‌లో భారత జట్టుకు ఆడి, కాంస్య పతక సాధనకు తోడ్పడింది. రెండు స్పెషల్ ఒలింపిక్స్‌లో ఆడి పతకాలను సాధించటం నిస్సందేహంగా నీహారిక ఘనతే. ఇందుకు పునాది, పట్టుదల, తపన ఆమె తల్లి భార్గవిది. పట్టుదలతో కృషిచేస్తే సాధించలేనిది ఏదీ లేదనేందుకు నిదర్శనమే వీరి విజయం.



స్పెషల్ ఒలింపిక్స్‌లో తలపడుతున్న నీహారిక (ఫైల్)

విభిన్న ప్రతిభావంతులకు తల్లిలా..

తన బిడ్డ నీహారిక లాంటి మరికొందరి కోసం ఇప్పుడా తల్లి ఏకంగా స్కూలునే నడుపుతోంది. 2020లో ప్రజ్ఞ వెల్ఫేర్ సొసైటీని రిజిస్టరు చేశారు. 2022 నుంచి ఆ సొసైటీ తరపున సాయి అంకుర్ స్పెషల్ స్కూల్‌ను ఆరంభించారు. 2019లో స్పెషల్ ఒలింపిక్స్‌లో పతకాల సాధనతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రైజ్‌మనీతో మొదలుపెట్టిన స్కూలుకు ఇప్పుడు సొంత డబ్బులు పడుతున్నాయి. పిల్లల తల్లిదండ్రుల మద్దతు తోడవుతోంది. పిల్లలు తమ పనులు తాము చేసుకోవటం, అవసరాలను తీర్చుకోవటం, వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడేలా శిక్షణనివ్వటం తమ ఆశయమని చెప్పారు భార్గవి. తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులోని 'సాయి అంకుర్ స్పెషల్ స్కూల్' ఇప్పుడు భార్గవి ప్రపంచం. 24 ఏళ్ల కుమార్తె నీహారికతో సహా పదిహేనుమంది విభిన్న ప్రతిభావంతులు అక్కడ ఉన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అక్కడ పిల్లలకు రకరకాల యాక్టివిటీస్, ఆటలతో బోధన ఉంటుంది. రోజువారీ స్కూలుకు వెళుతూ రెమిడియల్ క్లాసుకు వచ్చేవారూ ఉన్నారని భార్గవి చెప్పారు. తనతోపాటు అక్కడ ముగ్గురు టీచర్లు, ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ పని చేస్తున్నారు. పాప కోసం 'ఆటిజమ్ రీసెర్చ్ అండ్ మల్టీ డిసిప్లిన్ స్కూలు' టీచరుగా పనిచేసిన భార్గవి, ఇప్పుడు ఏకంగా అలాంటి స్కూలునే నడుపుతూ ఎందరికో తల్లిలా మారింది.



స్కూల్ వార్షికోత్సవంలో..

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 4,000

మోడల్ ధర రూ. 3,200



పసుపు ధరలు

(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1048

కొమ్ములు : 783 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,000	11,171	10,650

కాయలు : 265 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,000	11,171	10,650

మొత్తం అమ్మకాలు : 786.000 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ప్రజారవాణాలో డ్రైవర్లది ముఖ్యపాత్ర

- పీటీడీ జిల్లా అధికారి మధు
- శిక్షణ పొందిన డ్రైవర్లకు సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లు పొందిన డ్రైవర్లతో జిల్లా అధికారి మధు, డీఎం శ్రీనివాసరావు

నరసరావుపేట: శిక్షణ తీసుకున్న డ్రైవర్లు ప్రమాదరహితంగా వాహనాలను నడుపుతూ ఇంధన పొదుపు డ్రైవర్లుగా మెలగాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.మధు ఆకాంక్షించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఉన్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకున్న 19వ బ్యాచ్ డ్రైవర్లకు సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణాలో డ్రైవర్లది ముఖ్యపాత్రని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు స్వస్తి పలికి సేవా దృక్పథం అలవర్చుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించి ప్రమాదాలు నివారించాలని వెల్లడించారు. డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు పి.బొల్లయ్య, షేక్ సుభాని పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా శైలజ బాధ్యతల స్వీకరణ

మంగళగిరి : చినకాకానిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని చెప్పారు. మహిళలకు ఏ కష్టం వచ్చినా కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మహిళల హక్కులు, సంక్షేమ సాధనకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం

- బాధితుల గగ్గోలు
- న్యాయం చేయాలని పీజీఆర్‌ఎస్‌లో మొర

నగరంపాలెం: ఉద్యోగాల పేర్లతో మోసగించారని కొందరు, కంపెనీలో వచ్చే లాభాల్లో పర్సంటేజీలు ఇస్తామని మోసగించారని ఓ మహిళ వాపోయింది. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు– పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. బాధితుల ఫిర్యాదులను జిల్లా ఏఎస్పీలు (పరిపాలన) రమణమూర్తి, కె.సుప్రజ (క్రైం) స్వీకరించారు. వారి మొరను ఆలకించారు. ఫిర్యాదిదారులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు స్వీకరించిన వారిలో డీఎస్పీలు రమేష్ (ట్రాఫిక్), శివాజీరాజు (సీసీఎస్), శ్రీనివాసరెడ్డి (మహిళ పీఎస్) ఉన్నారు.



బాధితుల సమస్య వింటున్న జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

వ్యాపారంలో వాటా ఇస్తానని..

గుంటూరు లక్ష్మీపురంలోని ఓ ట్రేడింగ్ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేశా. వచ్చే లాభాల్లో పర్సంటేజీ ఇస్తానని యజమాని నమ్మించాడు. నేను రూ.20 లక్షలు, మరో ఇద్దరు రూ.10 లక్షలు చెల్లించారు. ఏళ్లు గడిచినా తిరిగి ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఆ ఏరియాలో కార్యాలయం లేదు. తెలిసిన వారి వద్ద అప్పులు, బ్యాంక్‌లో రుణం తీసుకుని అతనికి చెల్లించాను. ఈ క్రమంలో యజమాని భార్య మాతో అమర్యాదగా మాట్లాడుతోంది. వ్యాపారం లాభాల్లో పర్సంటేజ్ ఇస్తానని మోసగించిన అతనిపై చర్యలు తీసుకోవాలి.

– సబ్బినేని రోజ, వైష్ణవినగర్, పొన్నూరు టౌన్.

పాప చికిత్సపై విచారణ చేపట్టాలి



గత నెల 9న మా కుమార్తె లాస్య(16)కు జ్వరంలో మూర్ఛలు వచ్చాయి. కొత్తపేట గౌరీశంకర్ థియేటర్ రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాం. రెండు రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. అక్కడ నుంచి వారి ఆసుపత్రికి తరలించారు. మరో రెండు రోజులు పర్యవేక్షణలో ఉండాలని అక్కడి వైద్యులు సూచించారు. అదే రోజు రాత్రి వైద్యులు పిలిచి, పాప ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. దీంతో డిశ్చార్జ్ చేయాలని కోరాం. డిశ్చార్జ్ చేయడంలో అలస్యమైంది. రాత్రి తొమ్మిది తర్వాత చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించే క్రమంలో 11వ తేదీ ఉదయం పాప మృతి చెందింది. డిశ్చార్జ్ విషయంలో నిర్లక్ష్యం, పాపకు అందించిన చికిత్సపై విచారించాలని కోరుతున్నాం.

– లాస్య తల్లిదండ్రులు కల్యాణ్, ఉమాదేవి, మారుతీనగర్

ఉద్యోగాలు ఇప్పిస్తామని నగదు వసూలు

ఓ ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నా. ఈ క్రమంలో ఓ వ్యక్తి పరిచయమేయ్యారు. ఉద్యోగాల నిమిత్తం నలుగురు విద్యార్థులం కలిసి అతడి వద్దకు వెళ్లాం. ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరేందుకు ఒక్కొక్కరూ రూ.1.85 లక్షలు చెల్లించాలని చెప్పారు. దీంతో మొత్తమ్మీద రూ.7.40 లక్షలు అతనికి చెల్లించాం. ఈ క్రమంలో చిరునామా లేని ఓ కంపెనీలో ఆఫర్ లెటర్లు ఇచ్చారు. ఆ కంపెనీ ఫేక్ అని, గతంలోనూ పలువురిని మోసగించినట్లు తెలిసింది. ఉద్యోగాల పేర్లతో మోసగించిన వ్యక్తిని విచారించి తమకు న్యాయం చేయాలి.

– సయ్యాద్‌భాజా, ఆర్టీసీ కాలనీ

ఆర్మీలో ఉద్యోగమని రూ.34 లక్షలు ...

ఆర్మీ ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా తెలిసిన బంధువు పరిచయ్యారు. ఆర్మీలో ఉద్యోగం ఇప్పి స్తానని నన్ను, కుటుంబ సభ్యులను నమ్మించారు. నెల్లో ఉద్యోగం వస్తోందని, అందులో వారికి డబ్బులు చెల్లించాలని చెప్పి దఫాల వారీగా రూ.34 లక్షలు తీసుకున్నాడు. ఈ క్రమంలో గతేడాది ఆగస్టులో వైజాగ్‌లోని ఓ రూంలో బస చేయించాడు. తర్వాత అక్కడ నుంచి పంపించేశాడు. దీంతో మోసగించినట్లు తెలిసి డబ్బులు అడిగితే వాయిదాలు వేస్తున్నాడు. పెద్దల సమక్షంలో డబ్బులు చెల్లిస్తానని ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం డబ్బులు అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడు. పొలం, ఇంటి స్థలం విక్రయించగా వచ్చిన సొమ్ము, అప్పులు చేసిన డబ్బులు అతనికి చెల్లించాను. న్యాయం చేయాలి.

– బాధితుడు, పొన్నూరు

సజావుగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం జిల్లాలో సజావుగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 27 పరీక్ష కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసిన 841 మంది విద్యార్థుల్లో 561 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

రేపు డీఈవో కార్యాలయం ముట్టడి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సోమవారం సుదీర్ఘంగా జరిపిన చర్చలు విఫలం కావడంతో ఈనెల 21న డీఈవో కార్యాలయ ముట్టడి యథాతథంగా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకుడు కె.బసవ లింగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదించిన డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం వరకు వ్యవధిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కె.శివరామిరెడ్డిని రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బి.బాల మురళీకృష్ణను పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి (యాక్టివిటీ)గా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలకు 328 మంది హాజరు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ప్రారంభమైన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలకు 328 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, సెక్రటరీ ఎం లక్ష్మణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి షిఫ్ట్‌లో 176 మంది హాజరు కావాల్సి ఉండగా 164 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. సాయంత్రం రెండో షిఫ్ట్‌లో 176 మందికిగాను 164 మంది హాజరైనట్లు తెలిపారు. 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు తెలిపారు.

సమాజంలో ఉత్తమ వైద్యులుగా సేవలందించాలి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య రంగంలో అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకుని సమాజంలో ఉత్తమ వైద్యులుగా సేవలందించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ సూచించారు. చంద్రమౌళీ నగర్‌లోని భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ భాష్యం మెడెక్స్ నుంచి వందలాది మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక ఎయిమ్స్, జిప్‌మర్ వంటి సంస్థల్లో సీట్లు సాధించి వైద్యవిద్యనభ్యసించడం అభినందనీయమని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. వైద్య వృత్తిలో నైపుణ్యం సాధించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం మెడెక్స్ ద్వారా ఎంతో మంది విద్యార్థులు సీట్లు సాధించి ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల ద్వారా వైద్యవిద్యనభ్యసించి దేశ, విదేశాల్లో ఉత్తమ వైద్యులుగా రాణించడం ఒక గురువుగా తనకెంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. భాష్యం విద్యార్థులు ప్రపంచం నలుమూలలా భాష్యం ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను భాష్యం రామకృష్ణ దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్‌లో విద్యనభ్యసించిన 300 మంది వైద్య విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ చంద్రశేఖర్

పేదల ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ

గుంటూరు వెస్ట్: పేదల ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి సోమవారం అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం ఒక ప్రభుత్వ శాఖతో వీలుపడదని, అన్ని శాఖల మండల, జిల్లా అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. నిర్మాణానికి అవసరమైన సిమెంటు, ఇనుము అందుబాటులో ఉందని, ఇసుక కూడా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ లేఅవుట్లలో అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోసం టెండర్లు పిలవాలని తెలిపారు. గృహ నిర్మాణాలకు గానూ లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. పొలాల్లో నీటి కుంటల తవ్వకాల టార్గెట్ పూర్తి చేయాలని జేసీ చెప్పారు. రైస్ కార్డును ఏడురకాల సర్వీసు ప్రొవైడర్లు ఇస్తున్నారని, కొన్ని కేటగిరిల్లో వచ్చిన 11,446 సర్వీసు రిక్వెస్టులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు పురోగతిలో ఉండాలని, దీనికి సంబంధించి ఏ సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని జేసీ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, హౌసింగ్ పీడీ ప్రసాద్, స్టెప్ సీఈఓ ఆర్.చంద్రమణి, డ్వామా పీడీ శంకర్, సీపీఓ శేషశ్రీ , అధికారులు పాల్గొన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు

నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు

గుంటూరు లీగల్: ఈనెల 19 నుంచి జులై 5 వరకు జరగనున్న లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ ప్రమాదాల కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించడానికి కృషి చేయాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్. శరత్‌బాబు చెప్పారు. ఇన్స్యూరెన్స్ కంపెనీస్ ప్రతినిధులు, న్యాయవాదులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. మోటార్ వెహికల్ ప్రమాదాల కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కంపెనీ మెంబర్స్, కౌన్సెల్స్ పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. సమస్యలుంటే పిటిషనర్‌ను, అతడి కౌన్సెల్‌ను కూడా పిలిపించి ప్రీ సిట్టింగ్ ద్వారా కేసును రాజీ చేయాలని ఆయన సూచించారు. రెండో అదనపు జిల్లా జడ్జి వై. నాగరాజా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, బార్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ, ఇన్స్యూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, కౌన్సెల్స్‌కు పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో బార్ కౌన్సెల్ సభ్యుడు వి.బ్రహ్మారెడ్డి, న్యూ ఇండియా, ఓరియంటల్, యునైటెడ్, నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, కౌన్సెల్స్ పాల్గొన్నారు.



ఇన్స్యూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు, జడ్జి వై.నాగరాజా,

విద్యుత్ షాక్‌తో రైతు దుర్మరణం



మృతుడు చేకూరి హనుమంతరావు

నాదెండ్ల: విద్యుత్ షాక్‌కు గురై రైతు దుర్మరణం పాలైన సంఘటన మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చేకూరి హనుమంతరావు (70) తూబాడు రోడ్డులో తనకున్న వ్యవసాయ భూమిలో నర్సరీ నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం 3.30 సమయంలో పొలానికి వెళ్లి ఇనుప గేటు తీసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం చుట్టూ రక్షణగా వేసిన ఇనుప కంచెకు విద్యుత్ వైరు తగిలి విద్యుత్ ప్రవహించినట్లు తెలుస్తోంది. దీంతో గేటు తీసే క్రమంలో షాక్‌కు గురైనట్లు భావిస్తున్నారు. ఈ పొలాన్ని కౌలుకు తీసుకున్న చంటి అనే వ్యక్తి సాయంత్రం 4 గంటల సమయంలో వెళ్లగా, విగతజీవిగా పడిఉన్న హనుమంతరావును చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నగలు చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్టు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

చిలకలూరిపేట: బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట పట్టణంలోని డైక్‌మెన్ కాలనీకి చెందిన పేదాల రాముడు, మదర్ థెరిస్సా కాలనీలో నివాసం ఉంటున్న బీరా సిద్దు వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన యలగాల హనుమాయమ్మ ఈ నెల ఆరోతేదీన ఇంటికి తాళం వేసి సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి 11వ తేదీ ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. పరిశీలించగా 42 సవర్ల బంగారు నగలు, 59.40 గ్రాముల వెండి వస్తువులు, రాగి బిందెలు, చెంబులు, ఇత్తడి సామగ్రి దొంగతనానికి గురైనట్లు గుర్తించి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వీటి విలువ సుమారు రూ. 34లక్షలు ఉంటుంది. రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు, ఎస్ఐ జి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి నిందితులను చిన పసుమర్రు గొర్రెల మండి వద్ద అరెస్టు చేసి వారి నుంచి చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు అందిన వారంలోపు నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి నగలు స్వాధీనం చేసుకోవడంపై పోలీసు సిబ్బందికి డీఎస్పీ అభినందనలు తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐలు డి.రోసిరాబు, జి.సుబ్బారావు, హెచ్‌సీలు కె.దేవరాజు, జె.శ్రీధర్, పీసీలు ఎం.ఇర్మియా, బి.అశోక్, ఎం.రత్నకిశోర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): క్వారీలో పనికి వెళ్తూ ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం రాత్రి సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పట్టాభిరామయ్య తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన ఇలుమలై నాగరాజ్ (44) సజ్జాపురం గ్రామంలో ఉన్న తిరుమల సాయిచంద్ర గ్రానైట్ క్వారీలో పనిచేస్తుంటాడు. ఆదివారం రాత్రి ట్రాక్టర్ కొండ ఎక్కుతుండగా తిరగబడింది. ట్రాక్టర్ నడుపుతున్న నాగరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌పై ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు

చీరాల అర్బన్: తినుబండారాలు ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మితే చర్యలు తప్పవని చీరాల తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రపంచ తూనికలు, కొలతలు దినోత్సవం ఈనెల 20న నిర్వహిస్తున్నామని చెప్పారు. తూనికలు, కొలతల విభాగం 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లోని స్టాల్స్‌ను పరిశీలించారు. స్టాల్స్ నిర్వహించేవారు ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రయాణికులకు ప్రతి వస్తువును నిర్దేశించిన ధరలకు మాత్రమే అమ్మాలన్నారు. వస్తువు కొనుగోలు చేసే ముందు తూకం, ధరలు సరిచూసుకొని కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: మహిళపై లైంగిక దాడితో పాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య వివరాలు వెల్లడించారు. ఈనెల 12న మధ్యాహ్నం సుద్దపల్లి డొంక ప్రగతీ నగర్ 7వ లైనుకు చెందిన మహిళ తల్లి ఇంటికి వెళ్లింది. చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన షేక్ షాబాజ్ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి అమ్మమ్మ రాహేలమ్మ రావడంతో ఆమెను నెట్టివేసి అక్కడి నుంచి షాబాజ్ పరారయ్యాడు. మరుసటిరోజు 13వ తేదీన నిందితుడు షాబాజ్, ఆయన మేనమామ నాగూల్ మీరా, బంధువులు నాసర్ హుసేన్, హనీఫ్‌లు మహిళ ఇంటి వద్దకు వెళ్లి, జరిగిన విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. దీంతోపాటు కులం పేరుతో దూషించి వారి పట్ల అనుచితంగా ప్రవర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుడు షేక్‌షాబాజ్‌ను సోమవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ షేక్ అబ్దుల్ రహమాన్, సిబ్బందిని అభినందించారు. నిందితుడు షాబాజ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్